సాక్షి సూర్యాపేట

బుధవారం । 25 । డిసెంబర్ । 2024



ఒకే బడిలో చదవాలి
పేదలు, ధనికులు ఒకేబడిలో చదివిన ప్పుడే సమాన విద్య అందుతుందని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. - 10లో



సద్వినియోగం చేసుకోవాలి
టాస్క్ అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సీఈఓ శ్రీకాంత్ సిన్హా అన్నారు. - 10లో



షూటింగ్ బాల్ పోటీలు..
తెలంగాణ స్టేట్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ పోటీలు నల్లగొండలో ప్రారంభమయ్యాయి. - 10లో

నామినేటెడ్‌పై నజర్!

కార్పొరేషన్ పదవుల కోసం నేతల పోటీ

- తొలివిడతలో కొందరికే దక్కిన బెర్త్
- ఇప్పుడు రెండో విడత నియామకాలు చేపడతారని చర్చ
- ముమ్మర ప్రయత్నాల్లో ఆశావహులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తారన్న చర్చ మళ్లీ జోరందుకుంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత ప్రభుత్వం నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తుందన్న సమాచారంతో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్ కోసం పోటీపడి అధిష్టానం హామీతో తప్పనిసరి పరిస్థితుల్లో తప్పుకున్న వారిలో ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరికి మొదటి విడతలో పలువురికి పదవులు దక్కాయి. రెండో విడతలో ఎవరికి బెర్త్ దక్కనుందో త్వరలో తేలనుంది.

ఇప్పటికే ఐదుగురికి స్థానం..

ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే ప్రభుత్వం ఐదుగురికి కీలక పదవులను కట్టబెట్టింది. అందులో టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా పటేల్ రమేష్‌రెడ్డి, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బండ్రు శోభారాణి, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్య, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా చెవిటి వెంకన్న యాదవ్, పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్‌గా గుత్తా అమిత్‌ను నియమించింది. ప్రస్తుతం పలు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు, కీలకమైన కార్పొరేషన్లలో డైరెక్టర్ పదవులతో పాటు, వైటీడీఏ చైర్మన్, గ్రంథాలయసంస్థ చైర్మన్, సూర్యాపేట, మిర్యాలగూడ వంటి కీలకమైన మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను భర్తీ చేయాల్సి ఉంది. ఇప్పుడు జిల్లా నుంచి ఎవరెవరికి అవకాశం కల్పిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

నల్లగొండ జిల్లాలో కొందరికి పదవి ఖాయమని చర్చ

నామినేటెడ్ పదవులపై ఉమ్మడి జిల్లాలో చాలా మంది నేతలు ఆశలు పెట్టుకున్నారు. అందులో ముఖ్యంగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి జానారెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న కర్నాటి లింగారెడ్డికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవి దాదాపు ఖరారైందన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. కొన్ని కారణాలతో అధికారిక ప్రకటన ఆలస్యమవుతోందని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. మరోవైపు డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌కు కూడా జానారెడ్డి అండదండలు ఉన్నాయని, ఆయనకు ఏదో ఒక పదవి ఇస్తారన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డికి పదవి ఇప్పిస్తానని ఇదివరకే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయనకు పదవి వచ్చేలా మంత్రి వెంకట్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు టీపీసీసీ అధికార ప్రతినిధి, మునుగోడు నియోజకవర్గంలో మొదటి నుంచి పార్టీ వెన్నంటి ఉన్న పున్న కైలాష్ నేతకు స్థానం కల్పిస్తారన్న చర్చ సాగుతోంది. నకిరేకల్‌లో కొండేటి మల్లయ్య, దైద రవీందర్ అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించిన వారే. వారిలో ఒకరికి అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది.

అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి దక్కేనా?

పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. కానీ అధిష్టానం మాత్రం మందుల సామేల్‌కు టికెట్ ఇచ్చింది. అయితే ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తామని పార్టీ హామీ ఇచ్చింది. ఇటీవల గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకాల్లో ఆయనకు అవకాశం ఇవ్వలేదు. ఎమ్మెల్యేల కోటాలో త్వరలో ఖాళీ కాబోతున్న ఎమ్మెల్సీ పదవుల్లో దయాకర్‌కు అవకాశం దక్కుతుందా? లేదా? అన్న చర్చ జోరుగా సాగుతోంది.

ఆలేరు, భువనగిరిలోనూ..

ఆలేరు నియోజకవర్గానికి చెందిన యాదాద్రి జిల్లా డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, టీపీసీసీ మాజీ సభ్యుడు జనగామ ఉపేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నీలం పద్మ పదవులు వస్తాయన్న ఆశల్లో ఉన్నారు. అండెం సంజీవరెడ్డికి అధిష్టానం నుంచి హామీ ఉందన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. భువనగిరి నియోజకవర్గానికి చెందిన పోత్నక్ ప్రమోద్ కుమార్, తంగెళ్లపల్లి రవికుమార్, బర్రె జహంగీర్, రామాంజనేయులు, యుగేందర్‌రెడ్డి, శివరాజ్‌గౌడ్, తడక రమేష్ సైతం ఈసారి కీలకమైన పదవులు వస్తాయనే ఆశాభావంతో ఉన్నారు. యాదగిరిగుట్ట టెంపుల్ కమిటీని నియమిస్తే అందులో వేనేపల్లి చందర్‌రావు వంటి నేతలను పరిగణనలోకి తీసుకోవచ్చన్న చర్చ సాగుతోంది.

• హ్యాపీ క్రిస్మస్



క్రిస్మస్ సందర్భంగా మంగళవారం రాత్రి సూర్యాపేట పట్టణంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి తదితరులు



సూర్యాపేట పట్టణంలోని నిర్మల మాత చర్చిలో యేసు జనన వృత్తాంత ప్రదర్శన

ఈ సేవతో ప్రతిగడపకూ కోర్టు కార్యకలాపాలు

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే
- వర్చువల్‌గా హుజూర్‌నగర్ కోర్టులో ఈ సేవ కేంద్రం ప్రారంభం



ఈ సేవ కేంద్రం ప్రారంభోత్సవంలో న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది

హుజూర్‌నగర్ : ఈ సేవతో ప్రతి గడపకు కోర్టు కార్యకలాపాల ప్రక్రియ చేరినట్లవుతుందని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే పేర్కొన్నారు. హుజూర్‌నగర్ కోర్టుల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ సేవ కేంద్రాన్ని మంగళవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడారు. ఈ సేవా కేంద్రాల వల్ల కక్షిదారులకు విశేష ప్రయోజనాలు కలుగుతాయన్నారు. సమయం ఆదా అవుతుందన్నారు. జైలులో ఉన్న ఖైదీలతో వారి కుటుంబ సభ్యులు ములాఖత్ ద్వారా మాట్లాడడం, జరిమానా చలానాలు చెల్లించడం, కోర్టులోని రికార్డుల నకలు తీసుకోవడం తదితర ప్రయోజనాలు ఈ సేవా కేంద్రాల ద్వారా లభిస్తాయని ఆయన వివరించారు. ఈ సేవా కేంద్రాల సేవలను మరింత విస్తృత పరుస్తామన్నారు. కక్షిదారులందరూ ఈ సేవా కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రారంభ పూజల్లో సీనియర్ న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు, న్యాయవాది కొట్టు సురేష్, జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్యావతి, నజీర్, కవిత, మాధవి, జబ్బార్, అచ్చాలు, నరేష్, కిరణ్, నవీన్, శిరీష, మహేశ్వరి, సరస్వతి, రవి, సుకన్య, జానయ్య, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతరను ప్రశాంతంగా నిర్వహిస్తాం: ఎస్పీ



పెద్దగట్టు ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

చివ్వెంల(సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్దదైన శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు)జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ అన్నారు. మంగళవారం చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులోగల శ్రీ లింగమంతుల స్వామి ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా జాతరకు వచ్చే రోడ్డు మార్గాలు, భక్తులు వేచి ఉండే స్థలాలు, వాహన పార్కింగ్ ప్రదేశాలు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. బందోబస్త్‌కు కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించాలని స్థానిక పోలీస్ అధికారులకు సూచించారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట వాహన రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇతర శాఖల అధికారులతో కలిసి సమన్వయంగా పనిచేయాలన్నారు. జాతర ప్రాంగణంలో కావాల్సిన రక్షణ ఏర్పాట్లకు సంబంధించి ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవి, సీఐలు, ఎస్‌లు పాల్గొన్నారు.

ఎస్పీ క్రిస్మస్ శుభాకాంక్షలు

సూర్యాపేట టౌన్: జిల్లా ప్రజలకు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఓ ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలని, గొడవలు పెట్టుకోవద్దని కోరారు. ప్రయాణ సమయంలో వాహనాలపై జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు.

రూ.22.37కోట్లు మంజూరు

- యశ్వంతపూర్ వాగుపై బ్రిడ్జి, చెక్‌డ్యాం నిర్మాణం

తిరుమలగిరి: తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామ శివారు నుంచి వెళ్తున్న యశ్వంతపూర్ వాగుపై బ్రిడ్జితోపాటు, చెక్ డ్యాం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 22.37కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తాటిపాముల గ్రామానికి చెందిన రైతుల పొలాలు వాగు అవతల ఉంటాయి. అయితే వర్షాకాలంలో వాగు ఉప్పొంగినప్పుడు పొలాలకు వెళ్లాలంటే రైతులు ఇబ్బందులు పడేవారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఇక్కడి రైతులతో పాటు వస్తకొండూర్ నుంచి వచ్చే వారికి మేలు కలగనుంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వగ్రామం తాటిపాముల సమీపంలో వాగుపై బ్రిడ్జి, చెక్‌డ్యాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

జెర్రిపోతులగూడెం వాసికి డాక్టరేట్


సుధాకర్‌చారి

చిలుకూరు: మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన బేతు సుధాకర్ చారి అర్థశాస్త్ర విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులకు తెలిపారు. అర్థశాస్త్ర విభాగంలో ఏ స్టడీ ఆన్ అగ్రికల్చరల్ గ్రోత్ అండ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ డిస్పారిటీస్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను డాక్టరేట్ పట్టా పొందినట్లు పేర్కొన్నారు.

నిజాయితీ చాటుకున్న దంపతులు


ఉంగరం అందజేస్తున్న సాయిబాబా - కీర్తి దంపతులు

భువనగిరి, మోటకొండూరు : మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొడిగె సాయిబాబా–కీర్తి దంపతులు మంగళవారం భువనగిరిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి దర్శనం కోసం వెళ్లారు. అక్కడ వారికి ఒక బంగారు ఉంగరం దొరికింది. వారు వెంటనే 100 నంబర్‌కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఉంగరం పోగొట్టుకున్న బీబీనగర్‌కు చెందిన కట్ట బాలమణిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి సాయిబాబా దంపతుల చేతుల మీదుగా అందజేశారు. నిజాయితీ చాటుకున్న సాయిబాబా–కీర్తి దంపతులను పోలీసులు అభినందించారు.

ఖోఖో టోర్నమెంట్‌కు ఎంపిక


కోటేశ్వరరావు

హుజూర్‌నగర్ రూరల్ : బూరుగడ్డ గ్రామానికి చెందిన గువ్వల కోటేశ్వరరావు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. తమిళనాడు రాష్ట్రం తిరువారూర్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడులో ఈ నెల 27 నుంచి 31వరకు జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో టోర్నమెంట్‌లో పాల్గొనడానికి యూనివర్సిటీలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న కోటేశ్వరరావు ఎంజీయూ జట్టు తరఫున ఎంపిక అయ్యారని పేర్కొన్నారు.

లారీ చోరీ

తిప్పర్తి : లారీ చోరీకి గురైన సంఘటన తిప్పర్తి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. లారీ యజమాని, బాధితుడు నల్లగొండ పట్టణం రాంనగర్‌కు చెందిన పాలడుగు రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి లారీ అసోషియేషన్‌లో ఆధ్వర్యంలో తిప్పర్తి మార్కెట్ యార్డులో రాజు ఏపీ 29 టీబీ 3445 నంబర్ గల తన లారీని రోజు మాదిరిగానే సోమవారం సాయంత్రం ఇతర లారీలతో కలిపి ఉంచి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి లారీ కనిపించలేదు. దీంతో తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రాజు తెలిపారు.

● క్రిస్మస్ వేడుకలు


విద్యుత్ కాంతులతో మఠంపల్లిలోని శుభవార్త చర్చి


నడిగూడెంలో 124 ఏళ్లనాటి సీఎస్ఐ చర్చి


మఠంపల్లిలో చర్చి ఆవరణలోని మేరీమాత విగ్రహం


మఠంపల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

పేద, ధనికులు ఒకే బడిలో చదవాలి

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నల్లగొండ : పేదవారు.. ధనికులు అంతా ఒకేబడిలో చదివినప్పుడే అందరికీ సమాన విద్య అందుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నల్లగొండలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభల సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యలో ప్రభుత్వం అంతరాలను సృష్టిస్తోందని విమర్శించారు. సమాన విద్య అందినప్పుడే సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగుతాయన్నారు. అందుకోసం ప్రభుత్వాలు కూడా విద్యా, విజ్ఞానాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభలు నల్లగొండలోని లక్ష్మిగార్డెన్స్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటి రోజు భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామని.. ఆ తర్వాత రెండు రోజులు ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ×సినిమా వాళ్లు దేశ సేవ చేయడం లేదని.. వారి వ్యాపారం వాళ్లే చేసుకుంటున్నారని.. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వారిపై చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామన్నారు. తమ సంఘం నాయకులు కష్టపడి పనిచేస్తున్నారని ఎమ్మెల్సీగా తాను మళ్లీ గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు శేఖర్ రెడ్డి, జి.నాగమణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసచారి, పెరుమాళ్ల వెంకటేశం, ఉపాధ్యక్షులు నర్ర శేఖర్‌రెడ్డి, బడుగు అరుణ, ఎడ్ల సైదులు, పగిళ్ల సైదులు, నలపరాజు వెంకన్న, కొమర్రాజు సైదులు, మురళయ్య, వేదశ్రీ, రమాదేవి, మండల బాధ్యులు పాల్గొన్నారు.

నేల పరిరక్షణపై రైతులకు అవగాహన

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థినులు మంగళవారం రైతులకు నేల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ మాట్లాడుతూ రైతులకు వివిధ పంటల్లో ఎరువుల వినియోగంపై వివరించామన్నారు. సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. అదే విధంగా యాసంగి సీజన్‌లో ఆఖరి దుక్కిలో ఎకరానికి 20 కేజీల జింక్ సల్ఫేట్ వేయాలని సూచించారు. చలికి వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాసంగి వరిలో జింక్ ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ మనోజ్‌కుమార్, రైతులు వెంకట్‌రెడ్డి, రవి, విద్యార్థినులు దీప్తి, గౌతమి, కీర్తి, లక్ష్మిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న, కేవీకే శాస్త్రవేత్త, విద్యార్థులు

క్యాంపస్ సమాచారం

టాస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు టాస్క్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా అన్నారు. మంగళవారం ఎంజీయూలో డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటారన్నారు. నూతన ఆవిష్కరణలతో యువతకు మరింత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో టాస్క్ మేనేజర్ ప్రదీప్‌రెడ్డి, క్లస్టర్ మేనేజర్ సుధీర్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పరీక్ష మూల్యాంకనం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ

నల్లగొండ రూరల్: తెలుగు పరీక్ష మూల్యాంకనం, ప్రశ్నల తయారీ అంశంపై జరిగే శిక్షణ శిబిరం పోస్టర్‌ను ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ రవి మంగళవారం ఎంజీయూలో ఆవిష్కరించారు. జనవరి 6 నుంచి 11 వరకు మహాత్మాగాంధీ యూనివర్సిటీలో తెలుగు పరీక్ష మూల్యాంకనం, ప్రశ్నల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వీసీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ ప్రియ, తెలుగు అధ్యాపకులు ఆనంద్, సత్యనారాయణరెడ్డి, అనితకుమారి పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన కల్పించాలి

నల్లగొండ రూరల్: ఉన్నత విద్యలో అడుగుపెట్టే విద్యార్థులకు నూతన ఆవిష్కరణలపై అవగాహన కల్పించాలని ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఎంజీయూలో డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో డిగ్రీ, పీజీ విద్య స్థితిగతులు, సవాళ్లపై సమావేశం నిర్వహించారు. ఉన్నత విద్య పట్ల మక్కువతో డిగ్రీలో అడ్మిషన్ పొందే విద్యార్థులకు కొత్త ఆవిష్కరణలపై అవగాహన కల్పించాలన్నారు. రోజు తరగతులకు వస్తేనే విషయ పరిజ్ఞానం పెరగడంతోపాటు నూతన ఆలోచనలు వచ్చి పరిశోధక విద్యార్థులుగా తయారవుతారన్నారు. విద్యా ప్రమాణాలను పాటించాలని, విలువలతో కూడిన మానవ వనరుల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ రవి, ఓఎస్డీ అంజిరెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి, రామ్‌చందర్, సరిత, అరుణప్రియ, సుధారాణి పాల్గొన్నారు.

సాగర్ ఎడమ కాలువలో పడి యువకుడు మృతి

త్రిపురారం : సాగర్ ఎడమ కాలువలో పడి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నిడమనూరు మండలంలోని వేంపాడు గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మంచికల్లు గ్రామానికి చెందిన చల్లంచర్ల వెంకట్రామయ్య కుమారుడు శివ నాగరాజు (25).. మాచర్లకు చెందిన కొంత మందితో కలిసి అనుముల మండలంలోని అలీనగర్ వద్ద ఇటుక బట్టీల్లో కూలి పనులు చేయడానికి వచ్చాడు. అయితే వెంకట్రామయ్య తన సొంత గ్రామంలో ప్రభుత్వ ఇల్లు వచ్చిందనే సమాచారంతో పది రోజుల కిందట ఊరికి వెళ్లాడు. తండ్రి ఊరికి వెళ్లడంతో శివ నాగరాజు ఒక్కడే బట్టీల వద్ద పనిచేస్తున్నాడు. పక్క గ్రామంలోనే శివ నాగరాజు బావ సాంబశివరావు, అక్క నీలవేణి కూడా పనిచేస్తున్నారు. దీంతో ఆదివారం అక్క వద్దకు వెళ్తున్నానని శివ నాగరాజు తోటి పని వాళ్లకు చెప్పి వెళ్లాడు. శివ నాగరాజు సోమవారం పనికి రాకపోవడంతో మేస్త్రి శివ నాగరాజుకు ఫోన్ చేయడంతో వేరే వ్యక్తులు ఫోన్ ఎత్తి ఫోన్ కట్టపై పడి ఉందని చెప్పారు. మేస్త్రి వెంటనే శివ నాగరాజు బావకు సమాచారం ఇవ్వడంతో ఎడమ కాలువ పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం వేంపాడు బ్రిడ్జి కానాలకు తట్టుకుని గుర్తు తెలియని మృతదేహం ఉందని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసి శివ నాగరాజుగా గుర్తించారు. మృతుడికి ఫిట్స్ ఉండడంతో మనస్తాపానికి గురై ఎడమ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకట్రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్తను కడతేర్చిన భార్య


మృతుడు కుమార్ (ఫైల్)


కుమార్ ఒంటిపై గాయాలను పరిశీలిస్తున్న సీఐ సురేష్

డిండి : కుటుంబ తగాదాల కారణంగా భర్తను భార్య హత్య చేసింది. ఈ ఘటన డిండి మండలం దేవత్‌పల్లితండాలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండలం దేవత్‌పల్లితండాకు చెందిన రమావత్ కుమార్ (28)కు చందంపేట మండలం పోల్యానాయక్‌తండాకు చెందిన లక్ష్మితో పది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయంతోపాటు కూలి పనిచేస్తూ జీవనంగా సాగిస్తున్న వీరిమధ్య కొన్ని నెలల నుంచి గొడవలు జరుగుతున్నాయి. పొలంలో సాగు చేసిన వేరుశెనగ పంటకు నీరు పెట్టడానికి రోజు మాదిరిగానే సోమవారం రాత్రి కుమార్ తన భార్య లక్ష్మితో కలిసి వెళ్లాడు. ఎలాగైనా భర్తను అంతమొదించాలనుకున్న భార్య ఇతర వ్యక్తులతో కలిసి పథకం ప్రకారం.. పొలం వద్ద అర్ధరాత్రి మంచంపై పడుకున్న భర్త కుమార్‌పై రాళ్లు, కర్రలతో దాడి చేసి చంపింది. చీరతో అక్కడే ఉన్న వేప చెట్టుకు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించింది. మంగళవారం తెల్లవారుజామున గ్రామంలోకి వచ్చి కుమార్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, గ్రామస్తులకు నమ్మ బలికింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న తండావాసులు కుమార్ మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి పరిశీలించగా అతడి ఒంటిపై గాయాలు ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న సీఐ సురేష్, ఎస్ఐ రాజుకు తన కుమారుడుని.. కోడలు లక్ష్మి కొట్టి చంపిందని కుమార్ తల్లి సుకినీ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హత్య కేసు నమోదు చేసిన పోలీసులు లక్ష్మీని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిసింది. ఈ హత్యలో భాగస్వాములైన వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో కేంద్ర ప్రభుత్వ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద పలు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. మూడున్నర నెలల కాల వ్యవధి కలిగిన బేసిక్ కంప్యూటర్స్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఇంటర్మీడియట్, అకౌంట్ అసిస్టెంట్ (ట్యాలీ) కోర్సుకు బీకాం, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్ టూవీలర్ కోర్సుకు పదో తరగతి పాసై ఉండాలన్నారు. అలాగే 4 నెలల కాలవ్యవధి గల సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ కోర్సుకు పదో తరగతి, 5 నెలల కాలవ్యవధి కలిగిన ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్) కోర్సుకు ఐటీఐ లేదా పదో తరగతి, 4 నెలల కాలవ్యవధి గల సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు పదో తరగతి పాస్ లేదా ఐటీఐ కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు తప్పనిసరిగా ఉద్యోగం కూడా కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో జనవరి 2న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలన్నారు. వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పార్ట్ టైం జాబ్ పేరుతో మోసం

● బాధితుడి క్రెడిట్ కార్డు నుంచి డబ్బులు కాజేసిన సైబర్ నేరగాళ్లు

చౌటుప్పల్ రూరల్: పార్ట్ టైం జాబ్ పేరుతో సోషల్ మీడియాలో లింక్ పంపారు. దాన్ని ఓపెన్ చేసి వివరాలు ఇవ్వగానే నమ్మించడానికి సైబర్ నేరగాళ్లు బాధితుడికి రూ.150 యూపీఐ ద్వారా పంపించారు. ఇది నమ్మిన బాధితుడు తన క్రెడిట్ కార్డు వివరాలతోపాటు బ్యాంకు వివరాలు చెప్పాడు. ఇంకేముంది సైబర్ నేరగాళ్లు క్రెడిట్ కార్డు నుంచి దశలవారీగా మొత్తం రూ.61 వేలను కాజేశారు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో జరిగింది. బాధితుడు సుక్క శంకర్ మంగళవారం చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే ఏపీకే ఫైల్స్, బ్యాంకుల పేరుతో వచ్చే ఫైల్స్, పార్ట్‌టైం జాబ్స్, వర్క్ ఫ్రం హోం అని వచ్చే వాటి లింక్‌లను ఓపెన్ చేయవద్దని సీఐ కోరారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ


పుట్టగొడుగుల పెంపకం విధానాన్ని వివరిస్తున్న గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్.సుగంధి

గరిడేపల్లి : కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లిలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్ సుగంధి ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై మంగళవారం యువతకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పుట్టగొడుగుల ప్రాముఖ్యత, వాటి పోషక విలువలను తెలియజేశారు. ఈ సందర్భంగా సుగంధి మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకం ద్వారా మంచి పోషక ఆహారంతోపాటుగా స్వయం ఉపాధి పొందవచ్చని తెలిపారు. నూతనంగా పుట్టగొడుగుల పెంపకం చేపట్టేవారికి, ఇంతకు ముందు చేపట్టినవారికి సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో మహిళలు, నిరుద్యోగ యువతులు, అగ్రికల్చర్ విద్యార్థినులు పాల్గొన్నారు.

అట్టహాసంగా షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం

నల్లగొండ టూటౌన్: క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, ఓటమి విజయానికి నాంది కావాలని నీలగిరి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఏఎస్పీ రాములునాయక్ అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో 43వ తెలంగాణ స్టేట్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ షూటింగ్ బాల్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఓరుగంటి శ్రీనివాస్, షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం శ్రీనివాస్,సీహెచ్ ఐలయ్య, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేప నాగేందర్, కందికట్ల రజిత, దాసు, గంట్ల శశిధర్ రెడ్డి, సట్టు సైదులు, శ్రీధర్‌గౌడ్, పి.గణేశ్, రమేష్ యాదవ్, ప్రభాకర్, యాదయ్య, పీఈటీలు నాగరాజు, శంభు లింగం, విజయ్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నీలగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎస్పీ

డాక్టరేట్ పట్టా అందుకున్న జువేరియా ఫాతిమా


జువేరియా ఫాతిమా

భువనగిరి : పట్టణానికి చెందిన జువేరియా ఫాతిమా వైద్య విద్య పూర్తి చేయడంతో మంగళవారం సిద్దిపేటలోని హంస మెడికల్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ పట్టా అందజేశారు. పేద కుటుంబానికి చెందిన ఆమె కళాశాలలో బీహెచ్ఎంఎస్ కోర్సులో చేరి 5 సంవత్సరాలపాటు విద్యనభ్యసించారు. వైద్య విద్యలో ప్రతిభ కనబర్చినందుకుగాను పట్టాను పొందారు. డాక్టరేట్ పట్టా పొందిన జువేరియా ఫాతిమాను తెలంగాణ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అహ్మద్ జమాల్ షరీఫ్, ఫారోఖి మైనార్టీ జర్నలిస్టుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇంతియాజ్ అహ్మద్, ఇస్తియాక్, రఫీలు అభినందించారు.

గజ్జెల రామకృష్ణకు సాహితీ పురస్కారం


రామకృష్ణను సన్మానిస్తున్న నిర్వాహకులు

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లికి చెందిన కవి, సాహితీవేత్త గజ్జెల రామకృష్ణ మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో విశ్వభారతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. చేనేత వృత్తిలో రాణిస్తూ, సాహితీ రంగంలో చేస్తున్న విశేష కృషికిగాను రామకృష్ణకు గౌరీశంకర్ చేతుల మీదుగా నిర్వాహకులు శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో సినీ గీత రచయిత మల్లిక్, కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మర్రిగూడ : రైస్ మిల్లుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 31 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన మంగళవారం కమ్మగూడ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలంలోని మర్రిగూడ, కమ్మగూడ గ్రామ శివారులోగల రెండు రైస్ మిల్లుల్లో నల్లగొండ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు దాడులు నిర్వహించగా మర్రిగూడకు చెందిన రవి రైస్ మిల్లులో సుమారు 24 క్వింటాళ్ల రేషన్ బియ్యం, కమ్మగూడ గ్రామ శివారులోగల విజయ్‌కుమార్‌కు చెందిన రైస్ మిల్లులో సుమారు 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు.